# గులాబీకే జై కొట్టిన ఐటీ ఓటర్లు



- బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ హ్యాట్రిక్ విజయం
- తొలి నుంచి 23 రౌండ్లలో ఆధిక్యమే
- 47 వేల పై చిలుకు ఆధిక్యంతో గాంధీ విజయం

మియాపూర్, డిసెంబర్ 3 : దేశంలోనే పెద్దదిగా.. ఐటీకి వేదికగా ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓటర్లు గులాబీ జెండాకే జై కొట్టారు. వందలాది ఐటీ కంపెనీలు, లక్షలాది ఉద్యోగులు.. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు నివసించే మినీ భారతావనిలో కారు తన జోరును ప్రదర్శించింది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల తోడ్పాటుతో రూ.9 వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి.. సంక్షేమ పథకాల పట్ల ప్రజలలో విశ్వాసం.. నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ పట్ల ప్రజాదరణ వెరసి.. ఈ ఎన్నికలలో గాంధీకి హ్యాట్రిక్ విజయాన్నందించాయి. తాజాగా.. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్‌పై 47వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. మొత్తం 23 రౌండ్లలో సాగిన ఓట్ల లెక్కింపులో తొలి నుంచి చివరి రౌండ్ వరకు బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ తన ఆధిక్యతను చాటుతూ వచ్చారు. తుదిగా.. భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. పెద్ద నియోజకవర్గంలో పోలింగ్ 48.85 శాతమే నమోదైనా.. అధిక మొత్తంలో ఓట్లు బీఆర్ఎస్ అభ్యర్థికే పడటం విశేషం. నియోజకవర్గంలో మూడోసారి విజయం సాధించిన గాంధీకి పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు. తనపై విశ్వాసంతో హ్యాట్రిక్ విజయాన్ని అందించిన ప్రజలను గుండెల్లో దాచుకుంటానని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని అరెకపూడి గాంధీ పేర్కొన్నారు.

## తొలి రౌండ్ నుంచి తగ్గేదేలే..

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే బీఆర్ఎస్ హవా కొనసాగింది. తొలి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి 6582 ఓట్లు రాగా , భాజాపా అభ్యర్థి రవికుమార్‌కు 5338 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్‌కు 4382 ఓట్లు వచ్చాయి. తొలి రౌండ్‌లో భాజాపా అభ్యర్థిపై బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ 1244 ఓట్ల మెజార్టీ ఆధిక్యాన్ని కనబరిచారు. రెండో రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి 8002, కాంగ్రెస్ అభ్యర్థికి 5736, భాజపా అభ్యర్థి 5011 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థిపై బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ 2246 ఓట్ల మెజార్టీని సాధించారు. ఆ తరువాత భాజపా మూడో స్థానంలోకి వెళ్లింది. మూడో రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిపై బీఆర్ఎస్ గాంధీ తన స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తూ వచ్చారు. మూడో రౌండ్‌లో 5729 , నాలుగో రౌండ్‌లో 7197 , ఐదో రౌండ్‌లో 8490 , ఆరో రౌండ్‌లో 10074 , ఏడో రౌండ్‌లో 11,403, ఎనిమిదో రౌండ్‌లో 12,691, తొమ్మిదో రౌండ్‌లో 14, 333, పదో రౌండ్‌లో 17,412, పదకొండవ రౌండ్‌లో 18,634, పన్నెండవ రౌండ్‌లో 24,604, పదమూడవ రౌండ్‌లో 26,629, పద్నాల్గవ రౌండ్‌లో 24,939 , పదిహేనవ రౌండ్‌లో 29,947 , పదహారవ రౌండ్‌లో 33,793 , పదహేడవ రౌండ్‌లో 34,563 , పద్దెనిమిదవ రౌండ్‌లో 36,413 , పందొమ్మిదవ రౌండ్‌లో 38,148 , ఇరవైవ రౌండ్‌లో 38,569 , ఇరవై ఒకటవ రౌండ్‌లో 41,142 , ఇరవై రెండవ రౌండ్‌లో 44, 065, ఇరవై మూడవ రౌండ్‌లో 46,647 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ.. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్ గౌడ్‌పై విజయం సాధించారు. మొత్తం 23 రౌండ్ల ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ జోరు తగ్గేదేలే.. అన్న చందంగా కొనసాగి... అధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్నందించింది. దీంతో ఐటీ అడ్డాలో గులాబీ జెండా మరోసారి తన సత్తా చాటినట్లయింది.

☞ అయితే, ఓట్ల లెక్కింపు సందర్భంగా తొలి రౌండ్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ తన స్పష్టమైన ఆధిక్యాన్ని కొనసాగిస్తూ వచ్చారు. తొలి రౌండ్ నుంచే అసహనానికి గురైన కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్.. బీఆర్ఎస్ లీడ్ నేపథ్యంలో 11 రౌండ్‌లో కౌంటింగ్ హాల్ నుంచి వెళ్లిపోయారు. కాగా, రెండో రౌండ్ నుంచే మూడో స్థానంలో నిలుస్తూ వచ్చిన భాజాపా అభ్యర్థి రవికుమార్ కౌంటింగ్‌కే హాజరు కాలేదు.

# రంగారెడ్డి జిల్లాలో.. బీఆర్ఎస్ జోరు

- ఐదు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులకు పట్టం కట్టిన ప్రజలు
- మూడు చోట్ల కాంగ్రెస్ గెలుపు
- వరుసగా ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సబితా ఇంద్రారెడ్డి
- గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా హ్యాట్రిక్ వీరులే!

రంగారెడ్డి, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ) : 'అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ జోరు కొనసాగింది. 8 అసెంబ్లీ స్థానాలకు గాను.. 5 చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజానీకం పట్టం కట్టింది. మిగిలిన మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రతి ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ.. తాజాగా ఐదోసారి విజయాన్ని కైవసం చేసుకున్నారు. గెలిచిన మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సైతం మూడు, నాలుగుసార్లు ఎమ్మెల్యే పదవి వరించింది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ.. రంగారెడ్డి జిల్లాలో మెజార్టీ అభ్యర్థులు గెలవడంతో బీఆర్ఎస్ పార్టీ జిల్లాలో పట్టును నిలుపుకొంది..'

## అంతా గెలుపు వీరులే..

మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డి.. ఎమ్మెల్యేగా గెలుపొందడం ఇది ఐదోసారి. 2000లో జరిగిన ఉప ఎన్నికల్లో, 2004లో జరిగిన ఎన్నికల్లో ఆమె చేవెళ్ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత మహేశ్వరం నియోజకవర్గం నుంచి 2009, 2018 ఎన్నికల్లో గెలుపొందిన ఆమె.. అదే స్థానం నుంచి ఈసారి కూడా విజయాన్ని సొంతం చేసుకున్నారు. చేవెళ్ల నుంచి గెలుపొందిన కాలే యాదయ్య వరుసగా 2014, 2018, 2023 ఎన్నికల్లో గెలుస్తూ వచ్చి.. ఈసారి హ్యాట్రిక్ కొట్టారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా ఈ ఎన్నికల్లో గెలుపొందిన దేవినేని సుధీర్‌రెడ్డి 2009, 2018లో ఎమ్మెల్యేగా గెలిచి.. ఈసారి ఎన్నికల్లోనూ గెలవడం ద్వారా హ్యాట్రిక్ సాధించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ వరుసగా 2014, 2018 ఎన్నికల్లో గెలుస్తూ.. ఈసారి ఎన్నికల్లోనూ విజయ ఢంకా మోగించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ 2009, 2014, 2018 ఎన్నికల్లో విజయాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



## మూడు చోట్ల కాంగ్రెస్ గెలుపు ..

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందారు. 1994, 2004 ఎన్నికల్లో గెలుపొందిన ఈయన ఆ తర్వాత 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఓటమి పాలవుతూ వచ్చారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కె.శంకరయ్య గత పర్యాయం బీఎస్పీ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఈసారి కాంగ్రెస్ అధిష్టానం శంకరయ్యకు టికెట్ ఇవ్వగా.. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణ రెడ్డి 2014 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2016లో ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2023 ఎన్నికల్లో మొదటిసారిగా ఆయనను ఎమ్మెల్యే పదవి వరించింది.

# ఆరు రైళ్లు రద్దు.. రెండు రైళ్లు పునరుద్ధరణ

### రైల్వే అధికారులు వెల్లడి..

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఆరు రైళ్లు రద్దు చేస్తూ ఆదివారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఆరు రైళ్ల రద్దు కొనసాగుతుందన్నారు. ఈ క్రమంలో తిరునవెల్లి– బిలాస్‌పూర్, నాందేడ్ – సత్రగచి, సికింద్రాబాద్– రాయ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య కొనసాగుతున్న నిర్వహణ పనుల వల్ల ఈ మేరకు రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

### రెండు రైళ్లు పునరుద్ధరణ..

చెన్నై– అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య రద్దు చేసిన రెండు రైళ్లను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి రద్దు చేసిన రైళ్లు యథావిధిగా రాకపోకలు కొనసాగిస్తాయన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఓట్ల లెక్కింపు

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆదివారం ఉదయం నుంచి కొనసాగిన ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. నాలుగు జిల్లాలు, 13 నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన సైబరాబాద్ పోలీసులు.. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర బలగాలతో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పహారా పెట్టారు. దీంతో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

## కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

ఎన్నికల నిర్వహణ, ఓటింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియను మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని పోలీసులు భారీ బందో బస్తుతో విజయవంతం చేశారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాలకు భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు.. నిబంధనలకు విరుద్ధంగా తరలించే నగదు, నగలు, ఇతర వస్తువులపై నిఘా పెట్టారు. అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టుకొని, వారివద్ద నుంచి నగదు, నగలు సీజ్ చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా ఆదివారం ఉదయం నుంచి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో గొడవలకు తావు లేకుండా ఎన్నికల ప్రచారం, ఓటింగ్, కౌంటింగ్ ప్రక్రియలను విజయవంతం చేశారు.

# వివాహేతర సంబంధం సాకుతో హత్య

కవాడిగూడ, డిసెంబర్ 3: భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే నెపంతో ఓ వ్యక్తిని గొంతు నలిమి హత్య చేసిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ సునావత్ రవి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన కోట రాజేశ్ సికింద్రాబాద్‌లోని ఏఆర్‌పీసీ జీఆర్‌పీ ఏఆర్ ప్రధాన కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతడికి 2014లో ఓ యువతితో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు (10), కూతురు (7) ఉన్నారు. ఇదిలా ఉండగా.. మంచిర్యాలకు చెందిన కోట వెంకటేశ్ (27) బేగంపేటలోని ప్రశాంత్ నగర్‌లో నివాసముంటూ.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కోట రాజేశ్ ఇంటికి తరచూ కోట వెంకటేశ్ వస్తుండేవాడని, ఈ క్రమంలో అతడి భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు రాజేశ్ అనుమానించాడు. రాజేశ్ పథకం ప్రకారం వెంకటేశ్ భార్యా పిల్లలను అతడి స్వగ్రామానికి పంపించాడు. వెంకటేశ్‌కు రాజేశ్ ఫోన్‌చేసి.. పార్టీ ఇస్తానని పిలిచాడు. శనివారం మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి రాత్రి 11.45 గంటల వరకు వీరిద్దరూ కలిసి మద్యం తాగారు. కొత్త బోయిగూడ బర్రెలబస్తీలో మద్యం మత్తులో ఉన్న రాజేశ్ పథకం ప్రకారం వెంకటేశ్‌పై దాడిచేసి, ఆ తర్వాత గొంతు నలిమి హత్య చేశాడు. ఆ తరువాత తన సహోద్యోగులకు ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని తెలిపాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడు కోట రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు.

## మేడ్చల్ జిల్లా విజేతల వివరాలు

| నియోజకవర్గం | విజేత | పార్టీ | వచ్చిన ఓట్లు | మెజార్టీ | సమీప ప్రత్యర్థి | పార్టీ | ఓట్లు | పోలైన ఓట్లు |
|---|---|---|---|---|---|---|---|---|
| మేడ్చల్ | చామకూర మల్లారెడ్డి | బీఆర్ఎస్ | 1,86,017 | 33,419 | తోటకూర వజ్రేశ్ యాదవ్ | కాంగ్రెస్ | 1,52,598 | 3,96,790 |
| ఉప్పల్ | బండారు లక్ష్మారెడ్డి | బీఆర్ఎస్ | 1,32,433 | 49,429 | పరమేశ్వర్ రెడ్డి | కాంగ్రెస్ | 83004 | 272870 |
| కుత్బుల్లాపూర్ | కేపీ వివేకానంద | బీఆర్ఎస్ | 1,87,327 | 85,450 | కూన శ్రీశైలం గౌడ్ | బీజేపీ | 1,01,884 | 3,99,752 |
| కూకట్‌పల్లి | మాధవరం కృష్ణారావు | బీఆర్ఎస్ | 1,36,635 | 71,387 | బండి రమేశ్ | కాంగ్రెస్ | 65,248 | 2,49,894 |
| మల్కాజిగిరి | మర్రి రాజశేఖర్ రెడ్డి | బీఆర్ఎస్ | 1,25,049 | 49530 | మైనంపల్లి హన్మంతరావు | కాంగ్రెస్ | 75,519 | 2,64,189 |